జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 22-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 106 పేజీలు: 8 వెల : రూ.7

# ఇంటింటా... జ్వరం








*** జిల్లాలో ప్రబలుతున్న డెంగ్యూ * మంచం పట్టిన రోగులు * జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు * టెస్టుల పేరిట ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ * గ్రామాల్లో పలుచోట్ల వైద్య శిబిరాలు**

**శ్రీకాకుళం, ఆగస్టు 21 (వార్త):** సీజనల్ జ్వరాలు ఒకవైపు, డెంగీ మరోవైపు జిల్లావాసులను పట్టి పీడిస్తున్నాయి. ఏ ఇంటికి వెళ్లినా ఒకరిద్దరు జ్వరాలతో మంచం పట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. పీహెచ్‌సీ వైద్యులు సైతం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాతావరణంలో మార్పులు, దోమల వృద్ధి కారణంగా డెంగీ, టైఫాయిడ్, మలేరియాతో జిల్లావాసులు బాధపడుతున్నారు. ఆసుపత్రుల్లో ఓపీ కూడా రెట్టింపవుతోంది. శ్రీకాకుళం జిల్లాలో రిమ్స్, టెక్కలి జిల్లా ఆసుపత్రితో సహాయ 13 సామాజిక, 84 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అలాగే సుమారు 200లకు పైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వాటిలో జ్వరపీడితుల కోసం ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఈసారి విషజ్వరాలకు తోడు డెంగీ వణికిస్తోంది. వృద్ధులు, పిల్లల్లో డెంగీ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ఈనెలలో ఇప్పటి వరకూ రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. అయితే గతనెలలో ఓ వ్యక్తి డెంగీ లక్షణాలతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఏడాది నేటికీ 30 మలేరియా కేసులు గుర్తించడం జరిగిందని, గతసంవత్సరం కన్నా ఈ సంవత్సరం మలేరియా కేసులు పెరగడానికి ప్రధాన కారణం పక్క జిల్లాల నుంచి వ్యాప్తి చెందడమే కారణమని స్వయంగా డీఎంహెచ్‌వో డాక్టర్ మీనాక్షి మంగళవారం ప్రకటించారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ

ప్రైవేట్ ఆసుపత్రులకు సీజనల్ జ్వరాలు, డెంగీ కాసులు కురిపిస్తోంది. డెంగీ, మలేరియా, టైఫాయిడ్.. ఇలా అన్ని రకాల పరీక్షలు చేయిస్తూ సుమారు రూ.2 నుంచి రూ.3వేలు వరకూ పిండేస్తున్నారు. అలాగే మందులు, ఇంజక్షన్లు, సిలైన్లు అంటూ మరో పది వేలు వరకూ లాగేస్తున్నారు. కొందరు ప్రైవేటు వైద్యులు ల్యాబు నిర్వాహకులతో కుమ్మక్కై దందా చేస్తున్నారు. వైద్యులు ఒప్పందం ప్రకారం పరీక్షలకు సిఫార్సు చేస్తే వచ్చిన మొత్తం 40 నుంచి 50 శాతం కమీషన్‌గా ఇస్తున్నారు. దీంతో వైద్యులు అవసరమున్నా లేకున్నా అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నారు. గ్రామాల్లోని కొందరు ఆర్ఎంపీలు సైతం రోగులను ఒప్పందం చేసుకున్న వైద్యుల దగ్గరకు తీసుకొస్తూ కమీషన్లు దండుకుంటున్నారు. చాలా ల్యాబుల్లో సాధారణ జ్వరాలకు సైతం టైఫాయిడ్, డెంగీ, మలేరియా అంటూ నివేదికలు ఇచ్చేస్తున్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోయిందని కంగారు పెట్టేస్తున్నారు. అడ్డమైన కోర్సులు వాడించి వేలల్లో బిల్లులు చేసుకుంటున్నారు. ల్యాబుల్లో, ఆసుపత్రుల్లో సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టిక ఉండాలి. ఇవి ఎక్కడా కానరావడం లేదు. ఇలా ఇష్టారాజ్యంగా వసూళ్ల దందా చేస్తున్నా..అధికారులు పట్టించుకోవటం లేదు.

## పంచాయతీల్లో కానరాని పారిశుధ్య పనులు

పంచాయతీలకు నిధుల సమస్య వెంటాడుతోంది. దీంతో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. ఏ వీధి చూసినా చెత్తతో కనిపిస్తోంది. మురుగునీరు సైతం రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు విషజ్వరాలు, డెంగీ బారిన పడుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోంది.

# 23న గ్రామసభ నిర్వహించండి

*** ప్రజలంతా పాల్గొని అభివృద్ధి పనులు గుర్తించాలి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, ఆగస్టు 21(వార్త):** జిల్లా వ్యాప్తంగా ఈ నెల 23న జరగనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈ సభల్లో ప్రజలంతా పాల్గొనేలా చూడాలని, ఉపాధిహామీ పథకం కింద ప్రతిపాదించిన పనులపై విస్తృతంగా చర్చించడంతో పాటు అభివృద్ధి పనులు గుర్తించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జరిగే గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు హాజరైయేలా ఎంపీడీవోలు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలను సుస్థిర అభివృద్ధి దిశగా నడిపించే విధంగా ఈ ఉపాధి పనులను గుర్తించాలన్నారు. ఈ గ్రామసభలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గ్రామసభల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్న అనంతరం నోడల్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేరోజున గ్రామసభలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సభల్లో అర్ధవంతమైన చర్చ జరగాలని, ప్రతీ గ్రామ సభకు ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ ఎన్.వి చిట్టి రాజు, డిప్యూటీ సీఈవో ఎన్. వెంకట్ రామన్ హాజరయ్యారు.

# కాశీబుగ్గలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

*** ఇకపై ప్రతి శుక్రవారం నిర్వహణ**
*** ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి**



**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 21(వార్త):** కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో ఇకపై ప్రతి శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 11.30 నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. సోమవారం నిర్వహించే ఈ వేదికకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు రావడం కష్టంగా మారుతున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, వజ్రపుకొత్తూరు, మందస, పలాస, నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను ప్రజల పరిష్కార వేదికలో తెలియజేయాలన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సీఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



ఆమదాలవలస, ఆగస్టు 21 (వార్త): ఆమదాలవలస నూతన సీఐగా పాంద్రంకి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన ఎల్లంపేట, పార్వతీపురం మన్యం జిల్లాలో విధులు నిర్వహించి, బదిలీపై ఆమదాలవలస వచ్చారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన దివాకర్‌యాదవ్ విశాఖపట్నం వీఆర్‌కు వెళ్లారు.

## విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఆమదాలవలస, ఆగస్టు 21(వార్త):గాజుల కొల్లివలస ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ కార్యాలయం ఈఈ ఎస్.బయ్యన్నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గాజులకొల్లివలస, చిన్న జొన్నవలస, మునగవలస, రాధాకృష్ణపురం, రామచంద్రాపురం, పొన్నంపేట, చిట్టివలస, సైలాడ, కుమ్మరిపేట, చావ్వాకులపేట, అక్కులపేట,తాళ్లవలస, మండాది తదితర గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

# ఎస్సీలను వర్గీకరించొద్దు

- మానవహారంతో నిరసన వ్యక్తం చేసిన దళిత నాయకులు
- సుప్రీంకోర్టు తన తీర్పును పునస్సమీక్షించాలని అభ్యర్థన
- ప్రశాంతంగా ముగిసిన బంద్
- స్తంభించిన పలు వ్యాపారాలు, రవాణా



కొత్తూరు, ఆగస్టు 21(వార్త): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కొత్తూరులో బుధవారం చేపట్టిన భారత్‌బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ బంద్ ప్రభావంతో పలు వ్యాపారాలు స్తంభించాయి. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి ఆధ్వర్యంలో కొత్తూరు మండల దళిత నాయకులు అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు దళితుల అభివృద్ధికి గొడ్డలి పెట్టు వంటిదన్నారు. కార్యక్రమంలో జిల్లా దళిత నాయకులు బెంజమెన్,ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు టొంపల తిరుపతి, ఉపాధ్యక్షుడు వడమ శ్రీను, ప్రధాన కార్యదర్శి పడాల నాగభూషణం, కోశాధికారి బొడ్డేపల్లి రామకృష్ణ, సీనియర్ దళిత నాయకులు జమ్మయ్య మాస్టర్, బొడ్డేపల్లి కృష్ణ, ఎండునాయుడు, కింజరాపు సింహాచలం, గుడిబండి సింహాచలం, నాస బాలకృష్ణ, త్రినాథమ్మ, జర్జాన తిరుపతిరావు, దండు ప్రకాశరావు, కొర్ర రవి, టి.రామకృష్ణ, జి.రామారావు, ఎం.రాజారావు, టి.వాసు తదితరులు పాల్గొన్నారు.



### దళితుల ఐక్యతే ముద్దు

**మందస:** దళితుల ఐకమత్యం కావాలని ఎస్సీ నాయకులు అన్నారు. సొండిపూడిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం వారు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్గీకరణ వద్దని, ఐక్యమత్యమే ముద్దు అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు యానాది వాసుదేవు, మందస మండల అధ్యక్షుడు మిస్క గణపతి, ఉపాధ్యక్షుడు నగిరి విజయ్బాబు, దడ్డ కిరణ్‌కుమార్, కొత్తపల్లి ప్రేమ్‌చంద్, దడ్డ లక్ష్మీనారాయణ, నగిరి కూర్మారావు, మిస్క శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నరసన్నపేట:** సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ నరసన్నపేట నియోజకవర్గ నాలుగు మండలాల దళితులు స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని జలుమూరు మండల దళిత జేఏసీ కన్వీనర్ తవిటినాయుడు కోరారు.కార్యక్రమంలో నాలుగు మండలాల దళిత ప్రతినిధులు రామినాయుడు, లక్ష్మణ, చింతాడ దిలీప్, చింతాడ చిన్నారావు, మోహన్ పాల్గొన్నారు.



# అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం




మందస, ఆగస్టు, 21 (వార్త): అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. శాసనసభ్యురాలిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా సర్వసభ్య సమావేశానికి హాజరైన శిరీషను ఎంపీటీసీలు, సర్పంచులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతు నిర్లక్ష్యానికి గురయ్యాడని విమర్శించారు. సాగునీటి వనరులు అభివృద్ధి, కనీస మరమ్మతులు కూడా నిర్వహించలేదన్నారు. వచ్చే సీజన్‌లో మండలంలోని ప్రధాన సాగునీటి వనరులైన దామోదర్‌సాగర్, కళింగదళ్, డబారుసింగి రిజర్వాయర్ల అభివృద్ధి పనులు, మరమ్మతులు చేపడతామన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి రైతు సమస్యలను తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఐదేళ్లలో రాని వంశధార నీటిని 45 రోజుల్లోనే తీసుకువచ్చామన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు సక్రమంగా అందించాలని వైద్యాధికారులకు సూచించారు. జల జీవన్ మిషన్ పనులపై ఆరా తీశారు. సక్రమంగా పనులు నిర్వహించి ఇంటింటికీ కొళాయిల ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 23 నుంచి నిర్వహించనున్న గ్రామసభల్లో గ్రామానికి అవసరమైన పనులు చర్చించి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గ్రామ సభల్లో గ్రామ ప్రజలందరూ పాల్గొని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా సమావేశానికి డుమ్మా కొట్టిన ఆయా శాఖాధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కె.ఆదినారాయణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వాయలపల్లి తిరుమలరావు, ఈవోపీఆర్డీ అరసాడ రఘుపతిరావు, సివిల్ సప్లై డీటీ శనాపతి రవికుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రావాడ పేటలో వైద్య శిబిరం



నరసన్నపేట, ఆగస్టు 21(వార్త):జమ్ము పంచాయతీ రావాడపేటలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యాధికారి విజయ్ కుమార్ వైద్య సేవలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేపట్టారు. వర్షాకాలం కొనసాగుతున్న వేళ ప్రతి ఒక్కరూ వేడినీటిని తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.

## వ్యాధుల నివారణపై అవగాహన

నరసన్నపేట, ఆగస్టు 21(వార్త): వాతావరణ మార్పులతో వ్యాప్తి చెందుతున్న వ్యాధుల నివారణపై ప్రజలు అవగాహన పరుచుకోవాలని ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది అన్నారు, బుధవారం వారు దేవాది పంచాయతీలోని కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు ఎక్కువగా ఉండడంతో వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. దోమల నివారణపై చైతన్యవంతం కావాలని ప్రజలకు వివరించారు.





## ఆమదాలవలసలో కొవ్వొత్తుల ర్యాలీ

ఆమదాలవలస, ఆగస్టు, 21 (వార్త):కోల్‌కత్తాలో మహిళా ట్రైనీ డాక్టర్ పై హత్యాచార ఘటనకు నిరసన తెలియజేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పేడాడ రామ్మోహనరావు మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న దాడులను అరికట్టాలంటే దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ మీదుగా వనేవే కూడలి వరకూ ర్యాలీ కొనసాగించి, అక్కడ మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసేన పార్టీ కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆనంద్‌కు మొదలవలస పరామర్శ

బూర్జ , ఆగస్టు, 21 (వార్త): బూర్జ మండలం కొల్లివలస గ్రామానికి చెందిన సైరిగాపు ఆనంద్ మాతృమూర్తి మృతి విషయం తెలుసుకున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మొదలవలస రమేష్ ఆయనను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ కార్యకర్తలు పిల్లా కన్నంనాయుడు, బొల్లు సూరిబాబు, మేడి ప్రసాద్, నున్నగాపుల వాసు ఉన్నారు.



## గ్రామ సభలను విజయవంతం చేయండి



పోలాకి, ఆగస్టు 21 (వార్త): పోలాకి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహించాలని ఏపీడీ మురళీకృష్ణ ఆదేశించారు. బుధవారం పోలాకి ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న గ్రామాల్లో సాధారణ, మెటీరియల్ పనులను 38 రకాలు పనులు గుర్తించి, ఉపాధి పని ఆవశ్యకతను గ్రామ సభల్లో తెలియజేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ సభలకు ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

## సార్వత్రిక విద్యపై అవగాహన




సారవకోట, ఆగస్టు 21 (వార్త): సారవకోట మండల ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవో ఎంవీ రమణ ఆధ్వర్యంలో బుధవారం సార్వత్రిక విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సంక్షేమ సహాయకులు, వెలుగు సిబ్బందికి ఏపీ దూర విద్య విధానంపై పలు సూచనలు చేశారు. దూర విద్య విధానంలో పది, ఇంటర్లో ప్రవేశాలకు సార్వత్రిక విద్యాపీఠం నుంచి దరఖాస్తులకు ప్రకటన వెలువడినట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించాలన్నారు.

## వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



పోలాకి, ఆగస్టు 21 (వార్త): టెక్కలి నియోజకవర్గం నిమ్మాడ పంచాయతీ చిన్న వెంకటాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త తోట మల్లేష్‌పై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటంతో ఆయన మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును పోలాకి మండలం మబగాంలో బుధవారం ధర్మాన కృష్ణదాస్ అందజేశారు.

## గాలికుంటు వ్యాధికి టీకాలు

బూర్జ, ఆగస్టు 21(వార్త ): చీడివలస గ్రామంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పిల్ల కన్నంనాయుడు సమక్షంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో కొల్లివలస పశు వైద్యాధికారి గోపాసినా వెంకటరావు, నాయకులు రామానుజల దాలినాయుడు, మేడి ప్రసాదరావు, గడిదేశీ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



## వంతెన కట్టండి

**ఉప్పరపేట వాసుల వినతి**

**కూలిపోయి ఏడాదవుతోందని ఆవేదన**

**(జలుమూరు)**

పర్లాం పంచాయతీ ఉప్పరపేట గ్రామం వద్ద వంతెన కూలిపోయి ఏడాదవుతోంది. అయితే నేటికీ వంతెన నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్లాం ఇసుక ర్యాంపు నుంచి అధిక లోడ్లతో లారీలు రాకపోకలు సాగించడంతో గత ఏడాది ఆగస్టు 14న వంతెన కూలిపోయింది. కూలిన వంతెనకు నిధులు మంజూరు చేస్తామని చెప్పినప్పటికీ గత వైసీపీ హయాంలో ఆచరణకు నోచుకోలేదు.



# మాస్టార్‌కు అ'పూర్వ' సత్కారం



బూర్జ, ఆగస్టు 21(వార్త): బూర్జ మండలం కొల్లివలస గురుకుల పాఠశాల డ్రిల్ మాస్టారు వై.రమణారావు ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు అనేక మంది మూడు జిల్లాల నుంచి వచ్చి బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. విశాఖ జిల్లా గోలుగొండ గురుకుల పాఠశాలలో చదివి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న అనేక మంది పాల్గొని, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చక్రవర్తి, దేవుడు రాజుబాబు మాట్లాడుతూ ఆయన ఎటువంటి పదోన్నతి లేకుండా పదవీ విరమణ పొందడం చాలా బాధాకరం అన్నారు. ఆయన కృషితో ఎందరో పేద విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎన్నో విలువైన బహుమతులు సాధించారని గుర్తు చేశారు. వేలాది మంది విద్యార్థులకు ప్రభుత్వం ఉద్యోగులు రావడానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆచన సేవలకుగాను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కిందన్నారు. మాస్టారు సేవలు గురుకుల విద్యాలయాలు జిల్లా, రాష్ట్ర స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందరావు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు రామ్మూర్తి, మోహనరావు. గోవిందరావు, పూర్వ విద్యార్థులు దేవుడు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర చికిత్సలకు 72 మంది ఎంపిక

సారవకోట, ఆగస్టు 21 (వార్త):అలుదు గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 72 మందిని గుర్తించి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తెలిపారు. బుధవారం శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఓ ట్రస్టు నిర్వ హణలో ఈ నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఎంతోమంది వృద్ధులకు కంటి చూపు తగ్గిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి నిర్వహించామన్నారు.

**అలుదు పాఠశాల సందర్శన**

అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీ లించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాలలో శత శాతం సాధించినట్లు హెచ్‌ఎం తంప రామారావు తెలి పారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు శాసనమండలిలో చర్చించాలని పలువురు ఉపాధ్యా యులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు.



# కియోస్కా..కియోస్కా!

■ ఏడాదిగా నిరుపయోగంగా కియోస్కో యంత్రాలు ■ పట్టించుకోని అధికారులు

**(నరసన్నపేట)**

నరసన్నపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో గల పోలాకి, నరసన్నపేట, జలుమూరు మండలాల్లో ఆర్బీకే కేంద్రాల్లో రైతులకు ఎరువులు పంపిణీ నిర్వహణకు ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాలు వృథాగా పడి ఉన్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు ఇండెంట్, పంపిణీ తదితర వివరాలన్నీ ఈ యంత్రాల ద్వారా నిర్వహించేవారు. రెండేళ్లుగా ఈ యంత్రాలు వినియోగించకపోవడంతో ఆర్బీకే కేంద్రాల్లో మూలనపడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ యంత్రాలను వినియోగంలోకి తీసుకువస్తారని ఆశిద్దాం.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## కాశీబుగ్గ సీఐగా మోహనరావు బాధ్యతల స్వీకరణ

**పలాస, ఆగస్టు 21(వార్త):** కాశీబుగ్గ అర్బన్ పోలీసు స్టేషన్ సీఐగా మోహనరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కాశీబుగ్గలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణపై చర్చించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ మోహనరావు మీడియాతో మాట్లాడుతూ 2006 లో ట్రైనీ ఎస్సైగా కాశీబుగ్గలో బాధ్యతలు నిర్వహించానన్నారు. ఇక్కడి సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు.

### రైతు ఉత్పత్తిదారుల సంస్థను

# బలోపేతం చేయాలి

*** జిల్లాలో 32 ఎఫ్‌పీవోలు * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, ఆగస్టు 21 (వార్త):** జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు మెరుగైన, నాణ్యమైన పంటలను ఉత్పత్తి చేయడానికి ప్రోత్సహించాలని, వ్యవసాయ ఉత్పత్తి ఖర్చును తగ్గించడం ద్వారా రైతులు ఆదాయం పొందేందుకు వీలుంటుందని చెప్పారు. ఇందుకోసం మెరుగైన సాంకేతికత, మార్కెటింగ్ సౌకర్యం తదితర వాటి కోసం సన్న చిన్న కారు రైతులు ఎఫ్పీఓలో చేరి భాగస్వామ్యం కావడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. రైతులు పండించే పంటలకు పకడ్బందీ మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సన్న, చిన్న కారు రైతులు ఎఫ్పీఓ (ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్స్)లో భాగస్వాములు కావాలన్నారు. ఆర్థిక బలం తోపాటు మార్కెట్ అనుసంధానం పెంపొందించుకోవడానికి ఎఫ్పీఓలు దోహదపడతాయని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్ (నాబార్డ్), వివిధ సంస్థల ఆధ్వర్యంలో 32 ఎఫ్పీఓలు పనిచేస్తున్నట్లు వివరించారు. కొత్తవి ఏర్పాటు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించిన అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో పాలు, కూరగాయలు, మామిడి, జీడి మామిడి, కొబ్బరితో పాటు ఉద్యానవన పంటల మార్కెటింగ్ పై ఎఫ్పీఓలు దృష్టి పెట్టాలన్నారు. పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, రైతు బజార్లలో రిటైల్ దుకాణాలు ఇవ్వాలని, లైసెన్సులు జారీ సులభ తరం చేయాలని ఆయా ఎఫ్పివో లు కలెక్టర్ ను కోరారు. ఈ మేరకు పెండింగ్ లేకుండా అన్ని రకాల లైసెన్సులు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కే.శ్రీధర్‌ను



కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్డిఏ పీడీ పి.కిరణ్ కుమార్, డిసిసిబి సీఈవో వర ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్, నాబార్డు డీడీఎం కృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ బాగ్యలక్ష్మి, పశు సంవర్ధక శాఖ జేడీ జయరాజు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రతినిధి ప్రసాద రావు, జిల్లాలోని పలువురు ఎఫ్పిఓలు పాల్గొన్నారు.

### పీవీటీజీ జాతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

పర్టిక్యులర్ వల్నర్ బుల్ ట్రైబల్ గ్రూపులు(పివిటిజి) అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఆర్. సుబ్రహ్మణ్యం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుండి (పియం జన్మాన్ పై) గృహ నిర్మాణాలు, మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, గిరిజన సంక్షేమం, పంచాయతీ రాజ్, తదితర శాఖలపై ఆయన జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టర్ కార్యాలయ సమావేశం నుండి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతులుపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మందస మండలం చీపి, కొత్తూరు మండలం అడ్డంగి, నందిగాం మండలం పెదగురువూరు గ్రామాలను మోడల్ గ్రామాలుగా అభివృద్ధి చేయడానికి గుర్తించినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఉన్న పివిటిజి గ్రామాల గూర్చి ఆయన తెలిపారు. జిల్లాలో 534 పివిటిజి హేబిటేషన్లు ఉన్నాయని, పివిటిజిలు నివసిస్తున్న గ్రామాల్లో మౌలిక వసతులుపై ఆయన వివరించారు. 1650 గృహాలు మంజూరైనట్లు చెప్పారు. గృహ నిర్మాణాలకు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. హేబిటేషన్లుకు రహదారులు, తాగునీటి సరఫరా, జల జీవన్ మిషన్ ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్, రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్వహణ, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటుకు స్థలాలు గుర్తించినట్లు చెప్పారు. కొన్నిచోట్ల భూ సమస్య ఉందని, తహసీల్దార్లుతో చెప్పి క్లియర్ చేస్తామన్నారు. మొబైల్ నెట్‌వర్క్‌పై బియస్ఎన్ఎల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి టవర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి.శాంతి శ్రీ, సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం. శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ ఇన్ చార్జ్ పిడి నగేష్, పంచాయతీ రాజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.




## విలువలతో కూడిన విద్య అవసరం

**పలాస, ఆగస్టు 21(వార్త):** ప్రస్తుత సమాజంలో విలువలతో కూడిన విద్య నేర్చుకోవడం చాలా అవసరమని, విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ప్రముఖ వైద్యుడు హెచ్ రాజ్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక శ్రీ విద్యా వాహిని జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్వాగతోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పైల తిరుమల రావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు, ఉపాధ్యాయులు బి.కోదండరావు, బి.దుర్యోధనరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 2166మంది డ్రాపౌట్స్ గుర్తింపు



**పలాస, ఆగస్టు21 (వార్త):** పలాస మండలంలో గల పాఠశాలలో సుమారుగా ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 2166 మంది డ్రాపౌట్లను గుర్తించామని ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు తెలిపారు. వీరంతా ఆన్లైన్ యూడైస్‌లో లేకపోవడం వల్ల బడిబయట పిల్లలుగా గుర్తించడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం ఆ విద్యార్థి తల్లిదండ్రులు, వారు చదువుతున్న పూర్వ పాఠశాల సిబ్బంది, సి.ఆర్.యం. టి. ల సమన్వయంతో వారిని తిరిగి పాఠశాలలో జాయిన్ చేసి, వారిని ఆన్లైన్ చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ ఆదేశాలను ప్రైవేట్ పాఠశాలలు పాటించకపోతే ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు. పదవ తరగతి, 12 వ తరగతి ప్రవేశం చేయాలనుకున్నవారు ఓపెన్ స్కూల్ ద్వారా జాయిన్ అయ్యేందుకు అవకాశం ఉందన్నారు. సమా వేశంలో మండల విద్యాశాఖ అధికారులు సి.హెచ్.శ్రీనివాసరావు, సి.హెచ్. సత్యం, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, వార్డ్ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, సి.ఆర్.యం.టి.లు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



**పొందూరు, ఆగస్టు21 (వార్త):** ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం భారత్ బంద్ పిలుపుమేరకు పొందూరు, జి.సిగడాంలో ఎస్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక అంబేడ్కర్ కూడలిలో గల విగ్రహానికి సర్పంచ్ రేగిడి లక్ష్మి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్, ఎస్ఐలకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ నేతలు సునీల్‌కుమార్, గవరరాజు, రాము, పోతయ్య, రాజారావు, రాజు, చందక ఆదినారాయణ, యజ్జల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

**నరసన్నపేట, ఆగస్టు 21 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారి పి.సునీత బుధవారం తనిఖీ చేశారు. స్థానిక ప్రధాన రహదారిలో ఉన్న కోరమండల్ ఫెర్టిలైజర్ షాపులో రికా ర్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ఇచ్చిన ఎరువులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. షాప్‌లో నాలుగు రకాల శాంపిళ్లను సేకరించి తనిఖీకి పంపించారు.

### కాలువలకు షట్టర్లు..

# బిగించకుండా కాలయాపన

*** గొడాముల్లో షట్టర్లు తుప్పుపడుతున్నాయి * మరమ్మతులకు నోచుకోని 105 పిల్ల కాలువలు * గొట్టాబ్యారేజీ ఆధునీకరణకు వెయ్యి కోట్లు అవసరం * నత్తనడకన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణం * సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు**

**టెక్కలి, ఆగస్టు 21(వార్త):** వంశధార కాలువలకు తక్షణం షట్టర్లు బిగించి నీరు వృథాకాకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కమిటీ మెంబర్ నంబూరు షణ్ముఖరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. టెక్కలిలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. వంశధారలో నీరు ఉన్నప్పటికీ రైతాంగానికి నీరు అందకపోవడానికి కారణం పాలకుల నిర్లక్ష్యమేనన్నారు. 2009లో జరిగిన షట్టర్ల కుంభకోణం తర్వాత నేటికీ 15 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పాడైపోయిన షట్టర్స్ స్థానంలో కొత్తవి వేయలేదని విమర్శించారు. మరొకవైపున 900 టన్నుల షట్టర్లు గోదాంలో మూలుగుతూ తుప్పు పడుతున్నాయన్నారు. వాటిని ఎందుకు బిగించడం లేదని ప్రశ్నించారు. వంశధార ఎడమ కాలువకు కొత్త షట్టర్లు బిగించకుండా చివర భూములకు నీరు ఎలా ఇస్తారన్నారు. వంశధార ఎడమ కాలువ పొడవు 105 కిలోమీటర్లు ఉండగా, 60 కిలోమీటర్లు మేర హిరమండలం నుంచి టెక్కలి వరకు అన్ని షట్టర్లు, మధుమలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వాటిని తక్షణమే మరమ్మత్తులు చేయకపోతే కాలువలో నీరు వెళ్లే పరిస్థితి లేదని చెప్పారు. ఎడమ కాలువకు 68 పిల్ల కాలువలు, కుడి కాలువకు 37 పిల్ల కాలువలు పూర్తిగా మరమ్మతుకు నోచుకోలేదని వారు విమర్శించారు. వంశధార కాలువను ఆపరేట్ చేయడానికి గతంలో 200 మంది లస్కర్స్ ఉండేవారని, నేడు 20 మంది మాత్రమే ఉన్నారన్నారు. దీనివల్ల కాలువ



మెయింటెనెన్స్ కూడా జరగడం లేదన్నారు. జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వంశధారపై పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. గొట్టాబ్యారేజీ నిర్మాణం పూర్తయి 50 సంవత్సరాలు అయిందని మెయింటెనెన్స్‌కు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 50 సంవత్సరాలు పూర్తయిన ప్రాజెక్టులకు ఆధునీకరించాల్సివుందన్నారు. వంశధారకు ఆధునీకరణకు సుమారు వెయ్యి కోట్లు అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కొత్త షట్టర్లు బిగించడంతో పాటు మధుమలు, కాలువలు మరమ్మతులు చేయించాలని లస్కర్లను నియమించాలని కోరారు. కొండపేట ఎత్తిపోతల పథకం, టెక్కలి మదన గోపాలసాగరం ఎత్తిపోతల పథకం పనిచేసేలా చూడాలన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ప్రారంభించి 17 సంవత్సరాలు కావస్తున్న 13 కిలోమీటర్లు మేరకైనా కాలువల నిర్మాణం పూర్తి చేయలేదని విమర్శించారు. సమావేశంలో పాలిన సాంబమూర్తి, కొల్లి యల్లయ్య, ఉర్జాన లక్ష్మణరావు, హనుమంత ఈశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

శ్రీకాకుళం



## జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా**

**శ్రీకాకుళం లీగల్, ఆగస్టు 21 (వార్త):** సెప్టెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు, ఎస్ఎం ఫణికుమార్ పాల్గొన్నారు.




## సేంద్రీయ వ్యవసాయంతోనే నాణ్యమైన దిగుబడి

**హిరమండలం, ఆగస్టు 21 (వార్త):** సేంద్రీయ వ్యవసాయం చేయడం వల్ల నాణ్యమైన దిగుబడి వస్తుందని ఎన్ఎఫ్‌పి గోవిందరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో కొత్తూరు డివిజన్ లెవల్ రివ్యూ సమావేశం ఎంటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆగస్టు నెలలో సాధించిన ప్రగతిపై యూనిట్ వారీగా, ఐసిఆర్‌పి వారీగా చర్చించారు. సీజన్‌కు అనుగుణంగా నిల్వ ఉండే కషాయాలు, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, జీవామృతం, పంచగవ్య వంటి ద్రావణాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమీక్షలో ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

## పాండ్రమానుగూడలో వైద్య శిబిరం



**హిరమండలం, ఆగస్టు21 (వార్త):** పెద్దగూడ పంచాయతీ పాండ్ర మానుగూడ గిరిజన గ్రామంలో బుధవారం హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిగీత ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణీలకు, గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యవిద్యపై అవగాహన కల్పించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కాచి వడపెట్టిన నీటిని తాగాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య శిబిరంలో సిబ్బంది పాల్గొని సహకారం అందించారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం




**హిరమండలం, ఆగస్టు 21 (వార్త):** లింగ నిర్ధారణ చట్టరీత్యానేరమని చొర్లంగి పీహెచ్‌సీ వైద్యాధికారి యశ్వంత్ కుమార్ అన్నారు. బుధవారం చొర్లంగిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు స్కానింగ్ చేయించుకునేటప్పుడు బిడ్డ ఆడా, మగ అని అడగకూడదన్నారు. అలా అడిగినట్లయితే అడిగిన వారికి, చెప్పిన స్కాన్ సెంటర్ నిర్వాహకులకు శిక్ష పడుతుందని తెలిపారు. హెల్త్ రికార్డులలో నమోదైన గర్భిణీలు ఏ స్కాన్ సెంటర్‌కు వెళుతున్నారు, వారిలో ఎవరైనా అబార్షన్ చేయించుకుంటున్నారా తదితర అంశాలపై నిఘా ఉంచామన్నారు. ఈ ర్యాలీలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఈ పంట నమోదు చేసుకోండి

**హిరమండలం, ఆగస్టు 21 (వార్త):** రైతులు తాము పండిస్తున్న పంటలను ఈపంటలో నమోదు చేసుకోవాలని తహశీల్దార్ బి.వెంకటరమణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వీఆర్ఏ, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడారు. ఈపంటలో నమోదు చేయడం వల్ల రైతులకు పంట నష్ట పరిహారం, పంటల బీమా, వడ్డీ లేని రుణాలు, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు వర్తిస్తాయన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఆర్ఏ, వీఆర్వోలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్

*** జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి * జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలో రాణించిన పోలీస్ పిల్లలకు అభినందన**



**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 21 (వార్త):** క్రీడలతో ఆరోగ్యంతో పాటు, ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పోలీస్ సిబ్బంది పిల్లలు సత్తా చాటారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈనెల 10, 11 తేదీల్లో జిల్లా స్థాయి స్విమ్మిగ్ పోటీలో గెలుపొందిన పోలీస్ సిబ్బంది పిల్లలు, స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చౌదరి సుశాంత్, కె.అభిరామ్, కె.చిత్ర, ఎం.నికేష్, ఎం.పురందేశ్వరి ఈ పోటీల్లో విజేతలుగా నిలిచారు. వీరిని ఎస్పీ అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఒకవైపు చదువుతూ మరో వైపు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి అసోసియేషన్ తీసుకుంటున్న చొరవ అభిందనీయమని తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కూడా సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు హారిక ప్రసాదు, ఉపాధ్యక్షుడు జోగినాయుడు, అంతర్జాతీయ స్విమ్మర్ కాంతారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నౌపడ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**సంతబొమ్మాళి, ఆగస్టు 21 (వార్త):** జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం నౌపడ పోలీస్ స్టేషన్‌ను కస్మికంగా తనిఖీలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. విధుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్స్ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి నేరాలు నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఆన్ లైన్ సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, ఈవ్ టీజింగ్ వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు పోలీస్ స్టేషన్‌లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, క్రైమ్ రేటును మరింత తగ్గించేలా కృషి చేయాలని, కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, ప్రతిరోజు పెట్రోలింగ్‌లు నిర్వహించాలన్నారు. అనంతరం భావనపాడు మెరైన్ పీఎస్‌ను పరిశీలించారు. ఆయన వెంట టెక్కలి సిఐ కె.శ్రీనివాసరావు, నౌపడ ఎస్ఐ కిషోర్ వర్మ ఉన్నారు.




## మాజీ మండల ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ మృతి

**మెళియాపుట్టి, ఆగస్టు 21 (వార్త):** మాజీ మండల ఉపాధ్యక్షురాలు సవర అన్నపూర్ణమ్మ అనారోగ్యానికి గురై బుధవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందింది. అన్నపూర్ణమ్మ గతంలో మండల ఉపాధ్యక్షురాలుగా పనిచేయడంతో పాటు తర్వాత వైయస్సార్ పార్టీ జిల్లా ఎస్టీసెల్ మహిళ విభాగంలో అధ్యక్షురాలుగా పని చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. అన్నపూర్ణమ్మ అకాల మృతితో భర్త శంకర్రావు, సోదరుడు మాజీ ఎంపీపీ బైరసింగి లక్ష్మీనారాయణలకు వివిధ పార్టీలకు చెందిన పలువురు తమ సంతాపం వ్యక్తం చేశారు.

## దేవాదిలో వైద్య శిబిరం



**నరసన్నపేట, ఆగస్టు 21 (వార్త):** దేవాది పంచాయతీలో ఇటీవల నిర్వహించిన సర్వేలో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సుజాత తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పంచాయతీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పంచాయతీలో నీటి నిల్వలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి వైద్యాధికారి సూచించారు.

## వెంకటాపురం రోడ్డులో.. అడుగుకో గుంత

*** వర్షాలకు దెబ్బతిన్న రహదారులు * ఈ రూట్‌లో నిత్యం ప్రమాదాలు * గుంతలు పూడ్చడంలో అధికారులు విఫలం**





**సంతబొమ్మాళి, ఆగస్టు 21 (వార్త):** సంతబొమ్మాళి మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు పలు దెబ్బతిన్నాయి. అడుగుకో గుంత గజానికో గొయ్యిలా రోడ్లు పరిస్థితి మారింది. గుంతల రోడ్లపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంలా మారింది. వెంకటాపురం రోడ్డు మరీ అధ్వానంగా తయారైంది. సంతబొమ్మాళి గ్రామం నుంచి కేవలం అర కిలోమీటర్లు దూరం ఉండే వెంకటాపురం గ్రామానికి రహదారి అడుగు కో గొయ్యి దర్శనం ఇస్తుంది. ఈ గ్రామానికి పోలీస్ స్టేషన్ సమీపంలో నుంచి సిసి రహదారి ఉన్నప్పటికీ గ్రామస్తులు ఎక్కువగా గోతులు పడిన రహదారి వెంబడే గ్రామస్తులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సంతబొమ్మాళి మార్కెట్, ఇతర అవసరాలకు దగ్గరగా ఉన్నా ఈ రహదారినే వినియోగిస్తున్నారు. ఇప్పటికే గోతులు మాయమైన ఈ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు బురద గుంటగా మారి పాదచారులకు ఇబ్బందిగా మారింది. రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో ఎక్కడ లేదు తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు మరమ్మతులు చేయక పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పాడైన రహదారిని బాగుచేసి ప్రాణ ఆర్థిక నష్టాల నుంచి కాపాడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413